క్లుప్తంగా

అలీ అస్గర్‌కి ఘన నివాళి



అలీ అస్గర్‌కు నివాళిగా జూలా నిర్వహిస్తున్న భక్తులు

రామచంద్రపురం: ఇమామ్ హుస్సేన్ తన యుడు అలీ అస్గర్‌ను, హర్మలా అనే రాక్షసుడు బాణంతో చంపిన విషాద ఘటనను తలచుకుంటూ ద్రాక్షారామలోని ఆగా వారి పెద్ద పంజా నుంచి పంజుషా వరకు జూలా(ఉయల ఊరేగింపు)ను సోమవారం నిర్వహించారు. ఇరాక్ దేశంలోని నజాఫ్ నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా అల్లామా సయ్యద్ రయీస్, అహ్మద్ జార్చవిలు మజిలీస్‌లు ఆలపించారు. అంజుమన్ ఇసిఫాహ్ ఈ అలీ అస్గర్ ద్రాక్షారామ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగరం, ముమ్మిడివరం, అమలాపురం, చెయ్యేరు, చేదువాడ, విశాఖపట్నం, కాకినాడ, తాళ్లరేవు, జగ్గన్నపేట, మండపేట, రామచంద్రపురం మండలాల్లోని పలు గ్రామాల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై సర్వే చేయాలి

మండపేట: మండలంలోని ద్వారపూడి, కేశవరం గ్రామాల్లో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై సర్వే జరిపించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. పుంత రోడ్ల అభివృద్ధి పేరిట గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేస్తున్నారని పలుమార్లు తాను ఫిర్యాదు చేసిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన అధికారులను ప్రశ్నించారు.

ఎమ్మెల్సీ తోట పరామర్శ



కోరుమిల్లిలో అభిలాష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: అప్పులను కోల్పోయి బాధపడుతున్న పలువురుని సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. వాకతిప్ప పాఠశాలలో తేలుకుట్టి మృతి చెందిన కోరుమిల్లి గ్రామానికి చెందిన అభిలాష్ కుటుంబ సభ్యులను వారి ఇంటికెళ్లి పరామర్శించారు. భార్య వియోగంతో బాధపడుతున్న అంగర గ్రామానికి చెందిన డాక్టర్ సూరంపూడి ఉదయ్ కిరణ్‌ను, ఆయన తండ్రి మాజీ ఎంపీపీ సూరంపూడి సత్యనారాయణలను పరామర్శించారు. ప్రమాదంలో కాలి గాయంతో బాధపడుతున్న పడమర ఖండ్రిక జనసేన ఎంపీపీ భర్త పెద్దిరెడ్డి తమ్మయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

అంబాజీపేట: నందంపూడి శివారు పెచ్చెట్టివారి పాలెంలో సోమవారం నుంచి ఈ నెల 30 వరకు లక్ష్మీగణపతి స్వామివారి త్రిదిన దీక్షా ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెచ్చెట్టి లక్ష్మీనాగేశ్వరరావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను ఈ నెల 30న జరపనున్నామన్నారు. సోమవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ రోజు న భారీ అన్నసమారాధన చేపట్టామన్నారు.

చదువుపై ఆసక్తి కలిగించాలి

అంబాజీపేట: పాఠశాలకు వచ్చే విద్యార్థులపై ప్రేమతో మెలుగుతూ చదువుపై ఆసక్తి కలిగించాలని ఎంఈఓ మోకా ప్రకాష్ అన్నారు. మాచవరం శివారు ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సోమవారం పరిశీలించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులతో బ్లాక్ బోర్డుపై పాఠ్య పుస్తకాల్లో ఉన్న ప్రశ్న, జవాబులను రాయించి క్రమశిక్షణ, ఏకాగ్రతపై అవగాహన కల్పించారు.

కరెంట్ స్తంభం నుంచి జారిపడిన ప్రైవేటు లైన్‌మన్

అల్లవరం: బెండమూర్లంక పంచాయతీ పరిధిలో విద్యుత్ పనులు నిర్వహిస్తుండగా ఓడలరేవుకి చెందిన ప్రైవేటు లైన్‌మన్ నాగాబత్తుల శ్రీనివాస్ సోమవారం ప్రమాదవశాత్తూ స్తంభం పైనుంచి జారి పడిపోయాడు. ప్రమాదంలో శ్రీను వెన్నెముకకి బలమైన గాయం కావడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

కేశవరంలో 'టీడీపీ భవిష్యత్తుకు గ్యారంటీ'

మండపేట: భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు సోమవారం కేశవరంలో పర్యటించారు. పార్టీ నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, కర్రి తాతరావు, కంటిపూడి శ్రీనివాస్ తదితరులు ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మ్యానిఫెస్టోను స్థానికులకు అందజేశారు.

తెలుగు వెలుగులు



రాజమహేంద్రవరంలో భువన విజయం నాటికలో పింగళి సూరన్న పాత్ర ధారణలో తెలుగు అధ్యాపకులు షిర్డిసాయి (ఫైల్)



పల్లిపాలెం ఆంధ్ర కుటీరలో 'ఆంధ్ర పురాణ వ్యాఖ్యాన' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాణ (ఫైల్)

- కాలం మారినా మాతృభాష మాధుర్యం చెరగదు
- రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో సాహిత్య కృషి
- నేడు తెలుగుభాషా దినోత్సవం

కపిలేశ్వరపురం: భాష అంటే రాత, మాట కాదు.. అక్షరాలను వల్లెవేయడం మాత్రమే కాదు.. భాష అంటే మానవుని వ్యవహారిక జీవన శైలికి ప్రతిబింబం. ప్రకృతితో ప్రత్యక్ష అనుభవం కలిగిన మనిషికి కలిగే ఆలోచను వ్యక్తపర్చే వారధి భాష. విజ్ఞానాన్ని పంచుకునే, పెంచుకునే వేదిక భాష. అలాంటి భాషల్లోకెల్లా తెలుగు భాష గొప్పదని చరిత్ర చెబుతోంది. నేడు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

సాహిత్య కృషి ఇలా..

తెలుగు భాషకు మూలస్తంభాలైన కవితలు, కథానికలు, నవలలు, పద్యం, గద్యం, గేయం రచనలకు పుట్టినిల్లుగా రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల ప్రాంతాలు వెలుగొందుతున్నాయి. రామచంద్రాపురానికి చెందిన సినీ గేయ రచయిత, కవి, విమర్శకుడు, నాటక కళాకారుడు, నటుడు అయిన అదృష్ట దీపక్‌ను భౌతికంగా దూరమైనా ఆయన సాహిత్య వారసత్వం కొనసాగుతూనే ఉంది. ఆయన చివరి క్షణం వరకూ 'సాక్షి' దినపత్రిక 'ఫన్‌డే'లో భాషా నుడికట్టు శీర్షికను నిర్వహించారు. 40 సినిమాలకు పాటలను రాశారు.

▸▸ కాజులూరు మండలం పల్లిపాలెంలోని ఆంధ్రీ కుటీర సాహిత్య సాగరంలా ముందుకు సాగుతోంది. గ్రామాల్లో అక్షరాస్యత పెంచడం, సాహిత్యాభిలాష కలిగించడం, మాస పత్రికను నడపడం, గ్రంథాలయం నిర్వహణ, దళిత సామాజిక వర్గీయులకు సాంస్కృతాన్ని ఉచితంగా నేర్పడం లక్ష్యంగా 1938 జనవరి 13న మహాకవి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి ఆంధ్రీ కుటీరాన్ని స్థాపించారు. ఆయన మరణానంతరం ఆయన సోదరుడి కుమారుడు మధునాపంతుల సత్యనారాయణమూర్తి 1992లో ఆంధ్రీ కుటీరం బాధ్యతలను చేపట్టారు. 2020లో సత్యనారాయణ శాస్త్రి శతజయంతిని న్యూఢిల్లీకి చెందిన కేంద్ర సాహిత్య అకాడమీ పల్లిపాలెంలో ఘనంగా నిర్వహించారు. నెలనెలా సాహిత్య సమీక్షా కార్యక్రమాలు, పూర్వ కవుల సంస్మరణ సభలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

▸▸ రాయవరం మండలం చెల్లూరుకు చెందిన మార్ని జానకిరామయ్య కాకినాడ కేంద్రంగా సాహిత్య స్రవంతి పేరుతో సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

▸▸ మండపేట కేంద్రంగా ప్రముఖ హోమియో వైద్యులు చల్లా రవికుమార్ 'సంగమం' పేరుతో సామాజిక కార్యక్రమాల్లో భాగంగా సాహిత్య చర్చలు నిర్వహిస్తున్నారు.

▸▸ మాచరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పూజ్యం షిర్డిసాయి పురుషోత్తం తెలుగు విద్యాబోధనకే పరిమితం కాకుండా తెలుగు పాండిత్య కార్యక్రమాలకు హాజరవుతున్నారు. సీస పద్యాలను రచిస్తున్నారు. గతేడాది రాజమహేంద్రవరంలో నన్నయ భారతం రచనకు వెయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సాహిత్య అవధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనేక సాహిత్య కార్యక్రమాల్లో అష్టదిగ్గజాల కవిసమ్మేళన కార్యక్రమమైన భువన విజయంలో పింగళి సూరన్న పాత్రలో ప్రతిభకనబరుస్తున్నారు.

సాహిత్యం సామాన్యుల సాధనం



సాహిత్యమనేది పండితుల పాండిత్యానికి సంబంధించినది కానే కాదు. ప్రజల భాషలో ప్రజలను మేల్కొల్పేందుకు ప్రజల మధ్య ప్రవహించే స్రవంతి సాహిత్యం. ప్రజలను జాగృతం చేసేందుకు మహనీయులు చేసిన కృషిని కొనసాగించడం ద్వారా సాహిత్యాభిలాషను తర్వాత తరాలవారికి అందించగలుగుతాం. సాహితీ స్రవంతి పేరుతో నెలలో ఐదు రోజులు సాహిత్య కార్యక్రమాలను చేస్తున్నాం. ఈ కార్యక్రమాల ద్వారా పుస్తక అధ్యయనం, రచన, ప్రచారం, అభిప్రాయాలను పంచుకోవడం తదితర సాహిత్య కృషిని కొనసాగిస్తుండడాన్ని ఎంతో ఆనందంగా ఉంది.

– మార్ని జానకిరామ్ చౌదరి, సాహితి స్రవంతి నాయకులు, చెల్లూరు, రాయవరం మండలం

తెలుగుభాష ఔన్నత్యం కాపాడుదాం



చిన్నారులకు తెలుగు భాష గొప్పతనం చెప్పాలి. పాఠశాల దశ నుంచి చిన్నారుల మదిలో భాషను భద్రపరచాలి. ఆరో తరగతిలో పద్యధారణ శక్తిని ఉండాదు. పాఠశాలలో పనిచేసేటప్పుడు విద్యార్థులతో తెలుగు పద్యాలను కంఠస్థం చేయించేవాడిని. ఎనిమిదో తరగతి పిల్లలలో సాహిత్య రసజ్ఞానం ప్రారంభమవుతుంది. ఆ సమయంలో వారికి తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేయాలి. తెలుగుభాష ఔన్నత్యం కాపాడాలి.

– పూజ్యం షిర్డిసాయి పురుషోత్తం, తెలుగు అధ్యాపకులు, మాచర ప్రభుత్వ జూనియర్ కళాశాల, కపిలేశ్వరపురం మండలం

ఎదురుబిడియం కొంపలకు దారేది..



గతుకుల మయంగా మారిన ఎదురుబిడియం కొంపలు రోడ్డు

కె.గంగవరం: మండలంలోని కుడుపూరు శివారు ఎదురుబిడియం కొంపలు గ్రామానికి దారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో సుమారు 70 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కుడుపూరు గ్రామానికి అరకిలోమీటరు దూరంలో ఎదురుబిడియం కొంపలు గ్రామం ఉంది. ఈ గ్రామానికి పంట చేలో నుంచి ఉన్న కంకర రహదారే దిక్కు. పంట చేలోని నీరు రోడ్డుపైకి వచ్చి కనీసం నడవడానికి కూడా ఉండడం లేదని వర్షాకాలంలో అయితే గ్రామానికి రాకపోకలు ఉండవని స్థానికులు చెబుతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకున్నామని ఇప్పుడైనా అధికారులు గ్రామాన్ని గుర్తించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- పల్లిపాలెం గడప గడపకూ..



పల్లిపాలెంలో మహిళలకు పథకాల బ్రోచర్ వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: రాష్ట్రంలో పేదరికం అనుభవిస్తున్న కుటుంబాలకు ఆర్థిక పరమైన తోడ్పాటు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతోనే సీఎం జగన్ నవరత్నాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పల్లిపాలెంలో మంత్రి వేణుగోపాలకృష్ణ మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా ఏపీ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ప్రభుత్వ పథకాలు వారు మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. వృద్ధులతో పింఛను అందుతుందా అని, విద్యార్థులను అమ్మఒడి, విద్యా దీవెన అందుతున్నదా అని అడుగుతూ అద్దె ఇళ్లల్లో ఉన్న వారిని ఇంటి స్థలం మంజూరయిందా అని తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని గతంతో ఎన్నడూ లేనంత విధంగా ఈ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. సంక్షేమాన్ని ప్రజల ఇంటి గడప వద్దకు చేర్చేందుకు వలంటీర్ వ్యవస్థను, సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన సీఎంని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ముందుగా గొల్లపాలెంలో జరిగిన పార్టీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు పుట్టినరోజు వేడుకల్లో మంత్రి వేణుగోపాలకృష్ణ ఆయన తనయుడు నరేన్ పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ మేడిశెట్టి శ్రీను, స్థానిక పార్టీ నేతలు బిల్లకుర్తి కృష్ణారెడ్డి, గుత్తుల రామకృష్ణ, మట్టపర్తి నారాయణమూర్తి, టేకుమూడి సత్తిబాబు, బిల్లకుర్తి రామారెడ్డి, గుత్తుల గోవిందు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ జ్యోతిర్మయి

రాయవరం: వరి సాగులో ఎరువులు, పురుగు మందుల వినియోగం, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులు మరింత అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి అన్నారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వరి సాగులో ఎరువుల యాజమాన్య పద్ధతులపై మండల పరిధిలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జ్యోతిర్మయి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వరి సాగులో రైతులు అవలంబించే పద్ధతులు, శాస్త్ర సాంకేతికపరంగా చేపట్టాల్సిన పద్ధతుల క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించేందుకు గాను ఆత్మ సౌజన్యంతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయ క్షేత్రాల్లో చేపట్టిన మట్టి నమూనాల ఆధారంగా రైతులు ఎరువులు వినియోగించాలని తెలిపారు. అదేవిధంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు తదితర అంశాలపై రైతులకు వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ వరి పంటను ఆశించే పురుగుల జీవిత చరిత్ర, దశలు, పంట నష్టం, సస్యరక్షణ చర్యలపై రైతులకు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ పాల్గొని మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాస్త్ర వేత్తలు, అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ తక్కువ పెట్టుబడితో రైతులు అధిక దిగుబడులు సాధించి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శెట్టిబలిజ కల్యాణ మండపం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ తోట



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును కలిసిన శెట్టిబలిజ సంఘం నాయకులు

మండపేట: పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మండపం అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. శెట్టిబలిజ కల్యాణ మండపం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, శెట్టిబలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, కుడిపూడి రాంబాబు, నియోజకవర్గంలోని సంఘ నాయకులు సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు కల్యాణ మండపం అభివృద్ధికి నిధుల మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట సానుకూలంగా స్పందించారు. మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, సంఘ నాయకులు కుక్కల రామారావు, వాసంశెట్టి శ్రీనివాస్, గుత్తుల సూర్యనారాయణ, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి

- పృథ్వీరాజ్
- జాబ్‌మేళాలో 148 మందికి ఉద్యోగాలు



ఫ్రీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రొగ్రామ్‌ను ప్రారంభిస్తున్న పృథ్వీరాజ్

మండపేట: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ నేత తోట పృథ్వీరాజ్ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫ్లిప్‌కార్ట్, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్, ఎల్‌ఐసీ, కియా, పేటీఎం, కిమ్స్ తదితర 13 ప్రముఖ కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాలో 348 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసిన అనంతరం 148 మందికి ఉద్యోగాలు లభించాయి. అనంతరం ఏపీఎస్ఎస్‌డీఎస్ స్కిల్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రొగ్రామ్‌ను పృథ్వీరాజ్ ప్రారంభించారు. గతంలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వసంతలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చొల్లంగి సత్యవేణి, ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు, స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ లోకమాన్, ఏడీఎస్‌డీఈ ఓ నాగబాబు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

రామచంద్రపురం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా దరఖాస్తులను ఈనెల 28 నుంచి స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 2వ తారీఖు వరకు దరఖాస్తుల స్వీకరణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని తెలియజేశారు. కళాశాలలో బీఎస్సీ హానర్స్‌లో మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, బోటని, ఆక్వాకల్చర్, కంప్యూటర్ అప్లికేషన్లు మేజర్ సబ్జెక్టులుగా ఉన్నాయని, బీఏలో ఎకనామిక్స్, స్పెషల్ తెలుగు మేజర్‌గాను, బీకామ్‌లో జనరల్, కంప్యూటర్స్ మేజర్‌గా ఉన్నాయని తెలిపారు. మొదటి ఫేజ్‌లో అడ్మిషన్స్ పొందిన వారికి తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్య దీవెన, జగనన్న వసతి దీవెన విద్యార్థులకి అందించబడుతుందని తెలిపారు. విద్యాబోధనతో పాటు చివరి సంవత్సరం చదివే వారికి క్యాంపస్ ప్లేస్మెంట్స్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కోనసీమ ప్రాంత విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు

ఓటరు సర్వేపై నేడు సమావేశం

మండపేట: స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా నియోజకవర్గంలో ఓటరు సర్వేపై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు అధికారి సుధాసాగర్ అధ్యక్షతన సమావేశం జరుగనున్నట్టు ఎలక్షన్ డీటీ మెహర్‌బాబా తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై పలు సూచనలు, సలహాలు అందించాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

బీమా సొమ్ము అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి

కపిలేశ్వరపురం: కొత్తపేట పంట కాలువలో జారిపడి మృతి చెందిన కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంక గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి తోటకూర శ్రీనివాసరావు(47) కుటుంబ సభ్యులకు బీమా మంజూరులో భాగంగా రూ.10వేలను అందజేశారు. సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, నాయకులు వీధి గంగాధర్, కొండేటి జానికిరామ్, వీధి రాజు చేతుల మీదుగా సొమ్మును అందజేశారు.

మలుపు ప్రమాదాలకు పిలుపు



ద్వారాపూడి-యానాం రహదారిలో కాజులూరు మండలం కోలంక వద్ద ప్రమాదాలకు నిలయమైన మలుపు

కాజులూరు: ద్వారపూడి-యానాం రహదారిలో మండలంలోని కోలంక వద్ద ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. హైస్కూల్ సమీపంలో పొలమూరుపాడుకు వెళ్లే రహదారి వద్ద ఉన్న ఈ మలుపులో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ మలుపు ఇరుకుగా ఉండటానికి తోడు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాహనాలు అదుపు తప్పి వాటిని ఢీకొడుతున్నాయి. దీంతో సగటున నెలకు రెండు నుంచి మూడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు మృత్యువాత పడిన సంఘటనలు కొన్ని ఉండగా ఎందరో క్షతగాత్రులయ్యారు. ఇటీవల కొన్ని రోజుల క్రితం తాళ్లరేవు మండలం కాపులపాలెంకు చెందిన వ్యక్తి బైక్‌పై ద్రాక్షారామ వెళుతూ ఈ సెంటర్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో మలుపు వద్ద రోడ్డును వెడల్పు చేసి విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం కేశ ఖండన శాల కార్మికులు చేపట్టిన ఆందోళన సోమవారం మూడో రోజుకు చేరింది. కార్మికులు కత్తి డౌన్ చేసి విధులు బహిష్కరించి ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసి జీవో 110ని అమలు చేయాలని, దానికి అనుగుణంగా ప్రతి నెలా రూ.20 వేలు వేతనం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నా రు. పాత గుడి వద్ద ఉన్న కల్యాణ కట్ట వద్ద కార్మికులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కల్యాణ కట్టలో పని చేస్తున్న 37 మంది కార్మికులకు నెలకు రూ.20 వేలు వేతనం వర్తింప చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. వీటితో పాటు నాలుగు నెలల బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆందోళనలో సంఘం అధ్యక్షుడు ఆర్ఎస్‌వీవీ సత్యప్రసాద్, కార్య దర్శి పీవీవీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డీసీతో చర్చలు విఫలం..

ప్రభుత్వం జారీ చేసిన జీవోను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న నాయీ బ్రాహ్మణులతో ఎండోమెంట్స్ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు జరిపిన చర్యలు విఫలమయ్యాయి. 32 మందికి రూ.20 వేలు వంతున వేతనం చెల్లించాలని నాయీ బ్రాహ్మణులు డిమాండ్ చేశారు. ఆలయ ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని 20 మందికి మాత్రమే రు.20 వేలు వంతున వేతనం అమలు చేస్తామని, ఆందోళనను విరమించాలని డీసీ కోరారు. దానికి నాయీ బ్రాహ్మణులు విముఖత చూపడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో నాయీ బ్రాహ్మణులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు.

కోనసీమ కవులకు సత్కారం

అమలాపురం టౌన్: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఏలూరులో ఆదివారం రాత్రి జాతీయ స్థాయిలో జరిగిన మాతృ భాషా దినోత్సవ కవి సమ్మేళనంలో కోనసీమకు చెందిన పలువురు కవులు తమ కవితా గానాలను వినిపించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మాకే బాలార్జున, బుర్రకథ కళాకారుడు కడలి సత్యనారాయణ, రచయిత్రి కుంపట్ల సుభాషిణిలు మాతృ భాషపై రచించి వినిపించిన కవితలకు మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా కోనసీమ కవులను వేదికపై శ్రీశ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరుల చేతుల మీదుగా సత్కరించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

రామచంద్రపురం: విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు తగరం క్రీష్ణ బాబుపై వీరవల్లి పోలీసులు అక్రమ కేసులు బనాయించడం, ఆవుల పవన్‌కుమార్‌పై అక్రమ దాడులకు నిరసనగా రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించి నినాదాలు చేశారు. న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, న్యాయవాదులపై దాడులను ఖండించాలని నినాదాలు చేశారు. దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, అక్రమ కేసులు బనాయించిన వీరవల్లి పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిల్లి మురళీమోహన వెంకటరమణ, వాడ్రేవు సాయి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి వీర్రెడ్డి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా రామయ్య, న్యాయవాదులు, కె.భరత్‌కుమార్, కె.లోవరాజు, కేవీవీ సత్యనారాయణ, సుకుమార్, ఐ.గంగాధర్, ఎస్.గంగాధర్, జగదీష్, బండి శ్రీను, నేలపాటి వీరభద్రరావు, చోడే జాన్ రత్నం తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.